క్లుప్తంగా

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వీరభద్రేశ్వర స్వామి

తాండూరు రూరల్: వీరారెడ్డిపల్లి వీరభద్రేశ్వర దేవాలయ బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరిగాయి. వేడుక సందర్భంగా రెండు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగగా.. ఆదివారం స్వామివారికి అభిషేకం చేశారు. సోమవారం పల్లకీసేవ, అగ్నిగుండం కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం శివపార్వతుల కల్యాణం జరిపించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనూష, ఉప సర్పంచ్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా శ్మశానవాటిక



నిలిచిన శ్మశానవాటిక నిర్మాణ పనులు

తాండూరు రూరల్: చెంగోల్ గ్రామంలో శ్మశానవాటిక నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పంచాయతీ రాజ్ విభాగం నుంచి ప్రతి గ్రామానికి శ్మశానవాటిక నిర్మాణం కొరకు రూ.12 లక్షలు మంజూరు అయ్యాయి. అందులో భాగంగా చెంగోల్‌లో చేపట్టిన శ్మశానవాటిక పనులు సగంలోనే ఆగిపోయాయి. గదులు నిర్మించి వాటికి తలుపులు బిగించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. బోరు మోటారు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్మశాన వాటిక పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళలకు ప్రాధాన్యతనిచ్చిన అంబేడ్కర్

బొంరాస్‌పేట: రాజ్యాంగంలో మహిళల హక్కులకు అంబేడ్కర్ ప్రాధాన్యత ఇచ్చి గౌరవించారని ధర్మ సమాజ పార్టీ (డీఎస్పీ) కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట్రాములు అన్నారు. డీఎస్పీ ఆధ్వర్యంలో దుద్యాల మండల పరిధిలోని చిల్మల్‌మైలారంలో సోమవారం సాయంత్రం అంబేడ్కర్ విగ్రహం వద్ద పలువురు మహిళలను సన్మానించి మాట్లాడారు. తమ పార్టీలో ఎస్సీ పురుషులను మహరాజులుగా, మహిళలను మహరాణులుగా పిలుస్తూ గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ బొంరాస్‌పేట మండల అధ్యక్షుడు నిఖిల్ మహరాజ్, గుండుమాల్ మండల అధ్యక్షుడు తిరుమల్ మహరాజ్ పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

బొంరాస్‌పేట: దళితుల ఐక్యతకు మాదిగ రిజర్వేషన్ పోరాట కమిటీ (ఎమ్మార్పీఎస్) గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని ఆ సంఘం మండల ఇన్‌చార్జి సుభాష్ మాదిగ చెప్పారు. సోమవారం మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడుగా శ్రీకాంత్ మాదిగ, ఉపాధ్యక్షుడుగా వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్, అధికార ప్రతినిధి శేఖర్, కార్యదర్శి రాములు, కోశాధికారి డావుల వెంకటేశ్, కన్వీనర్‌గా బాలకృష్ణ, సలహాదారుడిగా వెంకటయ్య ఎన్నికయ్యారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

అనంతగిరి: ఐకేపీ, వీఓఏల సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం వీఓఏల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి, ఏపీఎంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేని యెడలా నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభు, పుల్లయ్య, సుధాకర్, రాంరెడ్డి, లక్ష్మి, సుజాత, జంగయ్య, ఇబ్రహీం, పల్లవి, మమత, కలయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణ గుర్తింపు తెస్తుంది



కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్‌ఐ శంకర్ తదితరులు

బొంరాస్‌పేట: విధి నిర్వహణ గుర్తింపు తెస్తుందని ఎస్‌ఐ శంకర్ అన్నారు. స్థానిక ఠాణాలో విధులు నిర్వహించి పలువురి మన్ననలు పొందిన కానిస్టేబుల్ (రైటర్) రవికుమార్ దౌల్తాబాద్ మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం బీఆర్‌ఎస్ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటయ్య, ఎస్‌ఐ శంకర్, సిబ్బంది రవికుమార్‌ను సన్మానించి వీడ్కోలు పలికారు.

ఓటమి విజయానికి సోపానం



కొడంగల్: టాస్ వేస్తున్న ఎంఈఓ రాంరెడ్డి



పెద్దేముల్: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



తాండూరు: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



ధారూరు: క్రీడోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

- గెలుపోటములు ఆటవిడుపుగా తీసుకోవాలి
- సీఎం కప్ క్రీడోత్సవాల ప్రారంభోత్సవంలో వక్తలు

యువతలో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్–2023 క్రీడోత్సవాలను ఘనంగా ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు టోర్నీని ప్రారంభించి 'ఆటాడుకుందాం రా.. అంటూ యువతను ఉత్తేజ పరిచారు. గెలుపోటములు సమానంగా స్వీకరించాలని, ఓటమి గెలుపునకు నాంది కావాలని క్రీడాకారులకు సూచించారు.

కొడంగల్: సీఎం కప్–2023 ఆట పోటీలు సోమవారం తొలిరోజున మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి ప్రారంభించారు. హస్నాబాద్, కొడంగల్ జట్లకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో క్రీడోత్సవాల కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పాండు, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఎంఈఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం కప్ క్రీడాపోటీలను ఎంపీపీ మధులత ప్రారంభించారు. పోటీల్లో 24 జట్లు పాల్గొన్నాయి. అందులో 12 కబడ్డీ, 12 వాలీబాల్ టీంలు ఉన్నాయని ఎంపీడీఓ లక్ష్మప్ప తెలిపారు. ఇదిలా ఉండగా.. మూడు రోజులుగా కొనసాగనున్న క్రీడోత్సవాల్లో కనీస వసతులు ఏర్పాటు చేయలేదని పలువురు క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేయగా.. అధికారులు తాగు నీటి వసతి కల్పించినట్లు సమాచారం. కార్యక్రమంలో పీఈటీలు రాధ, రాజు, గోపిక, భాస్కర్‌రెడ్డి, అంబదాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో

ధారూరు: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ ఆటల పోటీలను వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రారంభించి మాట్లాడారు. గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలని, ఓటమి గెలుపునకు నాంది అనే భావనతో ముందుకు వెళ్లాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భువనేశ్వర్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ శఫీ ఉల్లా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాలాలలో..

యాలాల: సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా ప్రారంభించారు. టోర్నీలో వాలీబాల్‌తో పాటు ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, ఎంపీడీఓ పుష్పలీల, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత సత్తా చాటాలి

తాండూరు: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తోందని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సెయింట్ మార్క్స్ స్కూల్ మైదానంలో టోర్నీని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: క్రీడలతో స్నేహ భావం పెంపొందుతుందని ఎంపీపీ బట్టు లలిత, జెడ్పీటీసీ పట్నే మధుకర్‌లు అన్నారు. ఎస్టీ ఆశ్రమ పాఠశాల క్రీడా ప్రాంగణంలో సీఎం కప్ మండల స్థాయి పోటీలను ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సోయెల్ షరీఫ్, ఎంపీటీసీ సంగీత, ఎంపీడీఓ రాజ్ మల్లయ్య, తహసీల్దార్ శ్రీధర్, ఎంఈఓ విద్యాసాగర్, ఎంపీఓ మహేశ్, ఏపీఎం పోచయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



యాలాల: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ

పూడూరులో..

పూడూరు: మండల కేంద్రంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడలను ఎంపీపీ మల్లేశం ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీలో పాల్గొనాలని, గెలుపోటములను సమానంగా తీసుకుని, ఓటమి గెలుపునకు నాందిగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేఘమాల, సర్పంచ్ నవ్య, ఎంపీటీసీ సల్మాతాజొద్దీన్, ఎంపీడీఓ ఉమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



మర్పల్లి: వాలీబాల్ సర్వీస్ చేసి పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ లలిత

గుంతల రోడ్డులో నరక ప్రయాణం

అధికలోడ్ వాహనాలతో దెబ్బతింటున్న రోడ్లు

తాండూరు రూరల్: కరన్‌కోట్–ఓగిపూర్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. గుంతలు ఏర్పడి ద్విచక్రవాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందిగా తయారైంది. నిత్యం పరిసర ప్రాంత నాపరాతి గనుల నుంచి వందల సంఖ్యలో నాపరాతి(అధిక) లోడ్‌తో లారీలు తాండూరుకు వెళ్తుంటాయి. దీంతో రోడ్డంతా ఛిద్రమై.. వర్షం పడినప్పుడు చిత్తడిగా మారుతుండడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అధిక లోడ్‌తో వాహనలు వెళ్లడంతోనే రోడ్డు దెబ్బతింటుందని, వాటిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే ఇలా అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి కరన్‌కోట్‌కు వేస్తున్న కొత్త రోడ్డు కూడా ఈ ఓవర్ లోడ్ కారణంగా త్వరగా దెబ్బతినే అవకాశం ఉంటుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అధికలోడు వాహనాల కట్టడికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



కరన్‌కోట్–ఓగిపూర్ మధ్య గుంతలమయమైన రోడ్డు

నకిలీ విత్తనాలను అరికట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ యాదయ్య

పరిగి: నకిలీ విత్తనాలు, మందులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కోళ్ల యాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులను మోసం చేసేందుకు ఫర్టిలైజర్ వ్యాపారులు అనేక మార్గాలను ఎంచుకుంటున్నారని, నకిలీ విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను బ్రాండ్ పేరుతో రైతులకు అంటగట్టి సొమ్ముచేసుకుంటున్నారని ఆరోపించారు. కావున ఫర్టిలైజర్ దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించి, నకిలీల బెడద నుంచి రైతులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జాకబ్, నాయకులు రాజు, చెన్నయ్య, రాజేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' కళ్లద్దాలతోనే సరి?



కంటివెలుగు శిబిరంలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య(ఫైల్)

- శస్త్ర చికిత్సపై నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న బాధితులు

నవాబుపేట: అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటివెలుగు కార్యక్రమం కేవలం దగ్గర చూపు, దూరపు చూపు ఉన్న బాధితులకు అద్దాలు ఇవ్వడం వరకే పరిమితం అయింది!. జనవరి 19న ప్రారంభమైన రెండో విడత కార్యక్రమం నుంచి సెలవు దినాలు మినహా నిరంతరం గ్రామాల్లో నిరంతరం కొనసాగుతోంది. కంటి సమస్యలతో వైద్య శిబిరాలకు వచ్చేవారికి నేత్ర పరీక్ష అనంతరం అవసరమ్యే కళ్లద్దాలు పంపిణీ చేస్తోంది. అదే సమయంలో కంటిలో శుక్లాలు, కంటి కొలికి వద్ద మాంసం పెరగడం, ఇతర కంటి జబ్బులతో బాధపడేవారి వివరాలను రికార్డుల్లో నమోదు చేసున్నప్పటికీ.. మెరుగైన వైద్యం, అవసరమైన వారికి శస్త్రచికిత్స చేయడానికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నట్లు తెలుస్తోంది.

ప్రైవేటు దవాఖానాలకు వెళ్లలేం..

ఇదిలా ఉండగా.. ఇంత పెద్ద కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసి, మెరుగైన చికిత్స, శస్త్రచికిత్స గురించి పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని, నిరుపేదలమైన తాము ప్రైవేటు దవాఖానాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోలేని పరిస్థితి అని కంటి శుక్లాలు, ఇతర సమస్యలతో బాధపడుతున్న బాధితులు ఆందోళ వ్యక్తంచేస్తున్నారు. శిబిరాల్లో దగ్గర చూపు అద్దాలు వెంటనే ఇస్తున్నప్పటికీ.. దగ్గర, దూరపు రెండు చూపుల సమస్య ఉన్నవారికి వారం పది రోజులు గడిచినా అద్దాలు ఇవ్వటం లేదని, పైగా బయట తీసుకోవాలని వైద్య సిబ్బంది చెపుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. నవాబుపేట మండలంలో జనవరి 19 నుంచి ఇప్పటి వరకు 17,833 మందికి వైద్య పరీక్ష చేశారు. అందులో రీడింగ్ అద్దాలు పొందిన వారు 2,491, ప్రిస్కిప్షన్ అద్దాలు తీసుకున్నవారు 2,515 మంది ఉన్నారు. శస్త్ర చికిత్స అవసరమైన వారు 300కు పైగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

> **ఆదేశాలు రాలేదు**
>
> 
>
> కంటివెలుగు శిబిరాల్లో కంటి శుక్లం, ఇతర నేత్ర సమస్యలున్న వారికి శస్త్ర చికిత్స చేయాల్సిన అవసరం ఉంది. వారి వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నాము. ఆపరేషన్ అవసరమున్న వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించాలని మాకు ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. రాగానే రిఫర్ చేస్తాము.
>
> – డాక్టర్ రోహిత్, నవాబుపేట వైద్యాధికారి

విధుల్లో చేరిన జేపీఎస్‌లు

యాలాల: క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో చేపట్టిన సమ్మెను జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విరమించారు. సోమవారం ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, ఎంపీడీఓ పుష్పలీల సమక్షంలో విధుల్లో చేరుతున్నట్లు ప్రకటించారు.

'దళితబంధు' పేరుతో దోపిడీ




దళితసంఘాల నాయికులు అందజేసిన వినతిని చదువుతున్న భట్టి విక్రమార్క

పరిగి: రాష్ట్రం ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి తీసుకువచ్చిన దళితబంధు పథకం పూర్తిగా అవినీతిమయంగా మారిందని, క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్ నాయకులకే అందుతుందని దళిత సంఘాల నాయులు, యువజన కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. అర్హులైన నిరుపేద దళితులకు అందాల్సిన పథకం ప్రజాప్రతినిధులు, వారి అనుచరులకే దక్కుతుందని, కమీషన్లు దండుకుంటూ లబ్ధిదారులను నిలువెల్లా ముంచుతున్నారని విమర్శించారు. దళితబంధుపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించి, నిజమైన లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను కలెక్టర్లకు అప్పజెప్పాలని కోరారు. ఇందుకు భట్టి సానుకూలంగా స్పందించి తప్పకుండా ప్రశ్నిస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జగన్, నాగవర్ధన్ పాల్గొన్నారు.

వణుకు పుట్టిస్తున్న వానరాలు

- జటిలమవుతున్న సమస్య
- ఇల్లుపీకి పందిరేస్తున్న వైనం
- అవస్థలు పడుతున్న జనం
- పంట నష్టపోతున్న రైతులు
- సర్వేకే పరిమితమైన సర్కారు చర్యలు

వికారాబాద్: కోతుల బెడద నుంచి రైతులను తప్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు సర్వేకే పరిమితమయ్యాయి. దశాబ్ద కాలంగా బాధిత రైతులు, ప్రజలు వణుకు పుట్టిస్తున్న వానరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతులు ఇవ్వగా.. ఎట్టకేలకు గత పదహారు నెలల క్రితం జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వానర గణన చేపట్టారు. సర్వే అనంతరం జిల్లాలో కోతుల బెడద మరింత ఎక్కువయింది. ఈ విషయంలో పలుమార్లు మంత్రి సబితారెడ్డిని కలిసి రైతులు విన్నవించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కానీ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. జిల్లాలో ప్రధానంగా ధారూరు మండలంలో అత్యధికంగా కోతులు ఉండగా.. పరిగి, కోట్‌పల్లి, దోమ, పెద్దేముల్, కుల్కచర్ల మండలాల్లో వాటి సంచారం అధికంగానే ఉంది. వ్యవసాయ శాఖ నిర్వహించిన సర్వే ప్రకారం ఒక్క ధారూరు మండంలోనే 194 గుంపులు ఉన్నట్లు గుర్తించగా.. ఇందులో 25,983 కోతులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. దోమ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కలిపి 2,986 వానరాలు ఉన్నాయి. నాటి సర్వే ప్రకారం 45 వేల కోతులు ఉన్నాయని లెక్కలు తేల్చగా.. ఆ సంఖ్య ఇప్పుడు 50 వేలు దాటి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



నివాసాలపై కోతుల గుంపు

రైతులకు అధిక నష్టం

కోతుల వలన రైతులు ఎక్కువగా పంట నష్టపోతున్నారు. వేరుశనగ, శనగ, పొద్దుతిరుగుడు, పండ్ల తోటలు, మొక్కజొన్న, కూరగాయలు తదితర పంటలకు తీవ్ర నష్టం కలుగుతోంది. మనుషుల చేతుల్లో ఏమైనా వస్తువులు ఉంటే దాడి చేస్తున్నాయి. జిల్లాలో ఎక్కువ శాతం నాపరాతి బండలతో కప్పిన పైకప్పులు ఉండగా.. వాటిని పీకి మరీ ఇళ్లలోకి చొరబడుతున్నాయి. ఏది చేతికి అందితే దాన్ని ఎత్తుకుపోతున్నాయి. వీటిని పూర్తి స్థాయిలో లెక్కించాక సుదూర అటవీ ప్రాంతాలకు తీసుకువెళ్లి వదలటం గాని, వాటికి కుటుంబ నియంత్రణ చేయటం కాని చేస్తారేమోనని బాధిత రైతులు, ప్రజలు ఆశించగా.. ప్రభుత్వం నుంచి ఎటువంటి కదలిక రాకపోవడంతో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు.

> **సర్వే నిర్వహించాం..**
>
> 
>
> కోతుల బెడద పెరిగిన విషయం ప్రభుత్వానికి నివేదించాము. ఈ మేరకు ప్రభుత్వం గణన చేపట్టాలని నిర్ణయించింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో కోతుల సర్వే పూర్తి చేశాం. ఏఈఓల ద్వారా లెక్కించి.. వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించాం. నివేదిక ప్రభుత్వానికి పంపించాం. తదుపరి కార్యాచరణ ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంది.
>
> – గోపాల్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

బీఎస్పీని ఆదరించాలి

బొంరాస్‌పేట: బీఎస్పీని ఆదరించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంగడిరాయిచూర్ నర్మద కోరారు. సోమవారం నాజ్‌ఖాన్‌పల్లిలో పార్టీ గ్రామ నూతన కమిటీ ఎన్నికలో ఆమె మాట్లాడారు. రాజ్యాధికారం కోసం బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనార్టీ (బహుజన) యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ.. గ్రామ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు సురేశ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, సంయుక్త కార్యదర్శి శివకుమార్, కన్వీనర్లుగా లక్ష్మమ్మ, ప్రేమ్ కుమార్, బాలరాజ్, వెంకటప్ప, కాశమ్మ, రాజు, ప్రవీణ్, వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నాగిరెడ్డి

దోమ: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. సోమవారం పాలేపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో సర్పంచ్ యశోదతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందన్నారు. రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తుందని, కావున ఈ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లేశం, ఎంపీటీసీలు విజయ, అనితగౌడ్, ఉపసర్పంచ్ రమేశ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్, ఏపీఎం సురేశ్, సీసీలు నారాయణ, జంగయ్య, పంచాయతీ కార్యదర్శి సంతోషి, ఐకేపీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నాగిరెడ్డి తదితరులు